

సోమవారం నగరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు శ్రీకృష్ణాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 27 ఆగస్టు 2024 | HYDERABAD




పద్మారావు నగర్ లో రోడ్డుపక్కన చెత్త తొలగించకపోవడంతో పరిసరాలు ఇలా దుర్గంధంగా మారాయి.

## దరఖాస్తుల ఆహ్వానం




సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపానీస్, స్పానిష్, హిందీ, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర భాషలను నేర్చుకోవడానికి మంగళవారం నుంచి ఈనెల 31 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రామకృష్ణమఠం నిర్వాహకులు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య దోమలగూడలోని ఆర్‌కే మఠ్‌ను లేదా 9603578545 వాట్సాప్ నంబర్‌లో కూడా సంప్రదించవచ్చని సూచించారు.


## బల్దియాలోనే ఉంటాం..

**బదిలీ చేసినా..సీటు వదలని డిప్యూటీ కమిషనర్లు**



సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : బదిలీ చేసినా.. బల్దియాను వదలమంటున్నారు కొందరు డిప్యూటీ కమిషనర్లు. దాదాపు 20 రోజుల తర్వాత బదిలీపై బల్దియాకు వచ్చిన అధికారులకు ఎట్టకేలకు కమిషనర్ పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ఒకరిద్దరి పోస్టింగ్‌లపై నేటికీ సస్పెన్స్ కొనసాగుతున్నది. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న అధికారి ఇతర చోటకు బదిలీ అయ్యారు. ఆ పోస్టు భర్తీ చేయలేదు. అయితే ఆ సర్కిల్ బాధ్యతలను ఇతరులను అప్పగించినట్లు ఈ నెల 21న జరిపిన 25 మంది అధికారుల అంతర్గత బదిలీల జాబితాలోనూ పేర్కొనలేదు. సదరు డిప్యూటీ కమిషనర్‌కు మేయర్ అండదండలు ఉన్నాయని, ఆమె ప్రమేయంతోనే జూబ్లీహిల్స్‌లోనే కొనసాగేలా.. ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ తిరిగి ఇక్కడే పోస్టింగ్ తెచ్చుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ డీసీ వ్యవహారం ఇలా ఉంటే.. సీడీఏ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ అయిన శ్రీధర్‌ను అక్కడి నుంచి అధికారులు రిలీవ్ చేయడం లేదు. సిద్దిపేటకు బదిలీ అయిన మరో డిప్యూటీ కమిషనర్ తిరిగి జీహెచ్ఎంసీకి వచ్చేలా పైరవీ చేస్తున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది.

## 'రుణమాఫీ' ముగిసినట్టేనా..?



మేడ్చల్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పథకం ముగిసినట్టేనా..? గ్రీవెన్స్ సెల్‌లో చేసిన దరఖాస్తులు నిరుపయోగమైనట్టేనా..? అధికారులు ముఖం చాటేస్తుండటంతో రైతుల్లో కలుగుతున్న అనుమానాలివి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడు విడతల్లో 3,442 మంది రైతులకు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేసింది. అర్హత ఉన్న సుమారు 26 వేల పైచిలుకు మందికి రుణమాఫీ కాలేదు. లబ్ధిపొందని రైతులు జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులు చేసుకుంటే.. రుణమాఫీ పథకాన్ని తిరిగి వర్తింపజేస్తామని అధికారులు ఎంతో ఆర్భాటంగా చెప్పారు. అయితే గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేసుకున్నా.. ఫలితం లేకపోవడంతో అసలు రుణమాఫీ పొందాలంటే అర్హత ఏమిటనీ అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల వద్దకు వెళితే వారు ముఖం చాటేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణకు శ్రీకారం చుడుతామని హెచ్చరిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాదికి మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 48, 072 మంది రైతులకు రైతుబంధు కింద రూ. 79.80 కోట్లు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 17కోట్లు మాత్రమే రుణమాఫీ చేసిందని రైతులు మండిపడుతున్నారు.




శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో సోమవారం అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య మూడు నివాసాలు, ఐదు నిర్మాణాలను కూల్చివేశారు. ఇండ్లల్లో ఉన్న సామగ్రి అంతటినీ ఇలా బయటపడేయడంతో ఆ కుటుంబాలన్నీ కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. నేలమట్టమైన తమ ఇండ్లను చూసుకుంటూ.. దీనంగా అక్కడే కూర్చుండిపోయారు.'ప్రజాపాలన అంటే ఇదేనా' అంటూ..ఆవేదన చెందారు.

# విల్లాలపై వివరణ ఇవ్వండి

hmda Growing Global

### నిబంధనలు అతిక్రమించారని విల్లాలకు హెచ్ఎండీఏ నోటీసులు

### చిత్రపురి కాలనీలో 50కిపైగా విల్లాలు ఉన్నట్లు వెల్లడి

సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) :నగరంలో అక్రమ నిర్మాణాలపై జరుగుతున్న కూల్చివేతల నేపథ్యంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం అధికారులు కీలక చర్యలు చేపట్టారు. తమ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించడంతోపాటు, నిబంధనలు అతిక్రమించిన ఇంటి యజమానులకు సైతం నోటీసులు జారీ చేస్తున్నారు. తాజాగా, చిత్రపురి కాలనీలో నిర్మించిన సుమారు 50కిపైగా విల్లాలకు స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నోటీసులను అందించినట్లు తేలింది. అయితే నోటీసుల ప్రకారం గ్రౌండ్+1 విల్లాలకు అనుమతులు తీసుకుని, నిర్మాణాలను అందుకు భిన్నంగా, అక్రమంగా మరో అంతస్తు విల్లాలను బిల్డర్లు నిర్మించినట్లు వెల్లడైంది. నిర్మాణంలో జరిగిన అవకతవకలను పట్టించుకోకపోవడంతోనే ఈ తరహా నిబంధనల అతిక్రమణ జరిగినట్లు తేలింది.

#### చర్యలు తీసుకుంటారా?

గచ్చిబౌలి, రాయదుర్గం వంటి ప్రధాన కేంద్రానికి సమీపంలో ఉండే సంపన్నుల విషయంలో హెచ్ఎండీఏ అధికారులు నోటీసులు అయితే జారీ చేశారు. కానీ తదుపరి ఏ విధమైన చర్యలు తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. 15 రోజుల గడువులోగా నోటీసులకు వివరణ ఇవ్వాలని హెచ్ఎండీఏ ఆదేశించింది. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులతో ఆయా భవన యజమానులకు సూచించినట్లు తేలింది. అయితే ఈ తరహా నిర్మాణాలు ఎన్ని ఉన్నాయనే అంశాన్ని కూడా తేల్చే క్రమంలో ఈ తరహా నోటీసుల ప్రక్రియకు తెరలేపినట్లుగా చర్చ నడుస్తోంది.




### హకీంపేట్ లే అవుట్‌లో మౌలిక వసతులు

హెచ్ఎండీఏ పరిధిలో భూముల వేలానికి అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. వందల ఎకరాల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ లే అవుట్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో పెండింగ్‌లో ఉన్న లే అవుట్లపై దృష్టి పెట్టిన అధికారులు... అందుకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. వచ్చే ఏడాదిలోగా లే అవుట్లను అభివృద్ధి చేయనున్నారు. షేక్‌పేట్ మండలం హకీంపేట్ పరిధిలోని హుడా హైట్స్ లే అవుట్‌లో రోడ్లు, హద్దురాళ్లు, అంతర్గత రోడ్లతోపాటు, డ్రైనేజీ కోసం రూ. 1.2 కోట్లతో పనులు చేపట్టనున్నారు. హుడా హైట్స్ పేరిట 50 ఎకరాల విస్తీర్ణంలో 92 ప్లాట్లను డెవలప్ చేయగా, తాజాగా మూడు నెలల్లోగా నిర్మాణ పనులు పూర్తి చేసేలా పనులు చేపట్టనున్నారు. అందుకు అనుగుణంగా టెండర్ ప్రక్రియను హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. వీటితోపాటు హెచ్ఎండీఏ అభివృద్ధి చేసిన అన్ని లే అవుట్లలో కూడా ఇదే తరహాలో మౌలిక వసతుల కల్పనకు పనులు చేపట్టనున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# సస్పెన్షన్లు ఉండవ్.. తీసేసుడే!

## పంజాగుట్టలా ఆ ఠాణాలను ప్రక్షాళన చేస్తా



**పోలీసుల వ్యవహారంపై 'నమస్తే' కథనాలు**

**స్పందించిన సీపీ.. అవినీతి అక్రమాలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరిక**

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): 'ఎంత మంది లించిన కొందరు సిబ్బందిలో మార్పు రావడం లేదు. పంజాగుట్ట ఠాణా మాదిరిగా మధురానగర్, బోరబండ పోలీస్‌స్టేషన్లనూ ప్రక్షాళన చేస్తా' అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆ రెండు ఠాణాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సోమవారం 'ఖాకీ కాసుల కక్కుర్తి', 'వ్యభిచార గృహాలనూ వదలట్లే' అనే శీర్షికలతో 'నమస్తే తెలంగాణ'లో కథనాలు రావడంతో అవినీతి అధికారుల్లో అలజడి మొదలైంది. ఈ కథనాలపై విలేకర్లు సీపీని ప్రశ్నించడంతో ఆయన స్పందించారు. ఈ రెండు ఠాణాలు అలా ఎందుకు తయారవుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. మధురానగర్ ఠాణాలో స్పాట్ సెంటర్ (వ్యభిచార గృహం) నుంచి కానిస్టేబుళ్లు మామూళ్లు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దానిపై విచారణ కొనసాగుతున్నదన్నారు. ఇక నుంచి సస్పెన్షన్లు ఉండవని, ఉద్యోగం నుంచి తొలగించడమే ఉంటుందని సిబ్బందిని హెచ్చరించారు. బండ్లగూడ ఠాణాలో ఓ కానిస్టేబుల్ పాన్ డబ్బాలో నుంచి మామూళ్లు తీసుకుంటున్నట్లు ఫిర్యాదురావడంతో విచారణ జరిపి నిజమని తేలడంతో సస్పెండ్ చేశామని సీపీ వెల్లడించారు. అలాగే ఆ రెండు ఠాణాల్లో అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు ఉన్నాయని, తగిన చర్యలు తీసుకుంటానని, పంజాగుట్ట ఠాణా మాదిరిగానే వాటిని కూడా ప్రక్షాళన చేస్తామన్నారు. అవినీతి, అక్రమాలు చేసే వారిని సస్పెండ్ చేస్తే భయం ఉండటం లేదని, ఇక నుంచి ఉద్యోగం నుంచి తొలగించడమే ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పనిచేయాలని సీపీ సిబ్బందిని హెచ్చరించారు.

## చార్జర్ కోసం చంపేశాడు

**వీడిన మహిళా హత్య కేసు మిస్టరీ**

దుండిగల్: దుండిగల్ పరిధి తండా-2లో జరిగిన మహిళా హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సోమవారం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో బాలానగర్ డీసీపీ కోటి రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. జెరుపుల శాంతి (45) దుండిగల్ తండా-2లో నివాసముంటున్నది. వరంగల్ జిల్లా హన్మకొండ సుబేదారికి చెందిన రావుల కమల్‌కుమార్(37) ఓ పరిశ్రమలో పనిచేస్తూ.. శాంతి ఇంటి పక్కనే అద్దెకుంటున్నాడు. ఈనెల 21న తన ఫోన్ చార్జర్ కనిపించకపోవడంతో శాంతితో కమల్ గొడవపడ్డాడు. 23న మరోసారి ఆమె ఇంటికి వెళ్లి ఘర్షణపడ్డాడు. తాను చార్జర్ తీయలేదంటూ.. కమల్‌కుమార్‌ను దుర్భాషలాడింది. ఆగ్రహానికి గురైన కమల్‌కుమార్ శాంతిని బలంగా నెట్టడంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. గాయాలతో అర్తనాదాలు చేయడంతో భయంతో కమల్ ఆమె నోరు, ముక్కును చేతులతో మూసివేయడంతో ఊపిరాడక చనిపోయింది. సీసీ పుటేజీ, సాంకేతిక ఆధారాలతో వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. కమల్‌కుమార్‌ను విచారించారు. అతడు నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేశారు.

## రెప్పపాటులో.. పోయిన ప్రాణం

**తండ్రీ కూతుళ్లను ఢీకొట్టిన టెంపో.. కుమార్తె దుర్మరణం**

ఖైరతాబాద్, ఆగస్టు 26 : వైద్య పరీక్షల కోసం కూతురుతో కలిసి తండ్రి బయలుదేరాడు.. ఇంతలో ఎక్కడి నుంచి వచ్చిందో ఓ వాహనం.. వేగంగా వీరు ప్రయాణిస్తున్న బైకును ఢీకొట్టింది.. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో తండ్రి ఎదుటే కుమార్తె విగతజీవిగా మారింది. ఈ హృదయవిదారకర ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని బేగంపేట మెట్రో స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రదీప్ తెలిపిన వివరాల ప్రకారం...బోడుప్పల్ చెంగిచర్లకు చెందిన మేధా శంకర్‌రావు మంగూరు పవర్ ప్లాట్ వద్ద స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్సైగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తె ప్రసన్న (25), కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. సోమాజిగూడలోని ఓ ప్రైవేటు దవాఖానలో శంకర్ రావుకు వైద్యపరీక్షల కోసం వెళ్లాల్సి ఉండటంతో సోమవారం ఉదయం కుమార్తె ప్రసన్నతో కలిసి బైకుపై ఆస్పత్రికి బయలుదేరారు. బేగంపేట మెట్రో స్టేషన్ సమీపంలోకి రాగానే అతివేగంగా వచ్చిన టెంపో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రి, కూతురు కిందపడిపోయారు. ప్రసన్న తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని గాంధీకి తరలించారు. శంకర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన టెంపో డ్రైవర్ సతీశ్‌ను అరెస్టు చేశారు.

# నిల్చోడానికీ తిప్పలే..

## కిక్కిరిస్తున్న మెట్రో..అదనపు కోచ్‌ల ఊసెత్తని ఎల్ అండ్ టీ

సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంలో మెట్రో రైలు సేవలు ప్రారంభమై ఆరేండ్లు దాటింది. ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి రోజూ 5లక్షలకు పైగా నగరవాసులు మెట్రోలో ప్రయాణిస్తున్నారు. 57 కోచ్‌లతో 69 కి.మీ మేర నడుస్తున్న మెట్రో రైళ్లలో కారిడార్-2 (జేబీఎస్-ఎంజీబీఎస్) మినహా మిగతా రెండు కారిడార్లలో రద్దీ అధికంగా ఉంటున్నది. కారిడార్-1( ఎల్బీనగర్-మియాపూర్), కారిడార్-3 ( నాగోల్-రాయదుర్గం)లో మెట్రో రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. కనీసం నిలబడేందుకూ చోటు ఉండటం లేదు. లోపలికి ఎక్కిన తర్వాత అటు ఇటు కదలడానికి కూడా అవకాశం లేనంతగా రద్దీ ఉంటున్నది. ఈ క్రమంలోనే కొన్ని నెలలుగా 3 కోచ్‌లు ఉన్న మెట్రో రైళ్ల బోగీలను ఆరుకు పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నా ఎల్‌అండ్‌టీ పట్టించుకోవడం లేదు. ఏటా ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నదే తప్ప.. ఎక్కడా తగ్గడం లేదు. భవిష్యత్‌లోనూ మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అయినా అదనపు మెట్రో కోచ్‌ల విషయంలో ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అదనపు కోచ్‌ల విషయంలో ఇప్పటి వరకు ఒక్క అడుగు ముందుకు వేయలేదు. కొత్త కోచ్‌ల కోసం ఆర్డర్లు ఇచ్చినా.. కొన్ని నెలల సమయం పడుతుంది. గతంలో సౌత్ కొరియా నుంచి కోచ్‌లను తెప్పించగా, అదనపు బోగీల కోసం మళ్లీ అక్కడి నుంచే తెప్పించే ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలు మాత్రం కనిపించడం లేదు. కాగా, రద్దీగా ఉన్న మెట్రో రైళ్లలోనే ఇరుక్కొని ప్రయాణం చేయాల్సి వస్తోందంటూ సోషల్ మీడియా వేదికగా కొందరు ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఫొటోలతో సహా తరచూ పోస్టులు చేస్తున్నారు. అయినా ఎల్ అండ్ టీ మెట్రో అధికారులు అదనపు కోచ్‌లను తీసుకురావడంలో ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ సైతం ఈ విషయంలో ఎల్ అండ్‌టీపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదు. ఇదే పరిస్థితి ఉంటే తాము మెట్రో రైళ్లలో ప్రయాణం చేయడం అంటే నిత్యం నరకంగా భావించాల్సి ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మెట్రో ప్రయాణికుల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకొని అదనపు మెట్రో కోచ్‌లను తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలంటున్నారు.



## రూ.8.5 కోట్ల విలువైన

# డ్రగ్స్ స్వాధీనం

**బోయిన్‌పల్లిలో పట్టివేత..ముగ్గురు అరెస్టు**



సిటీబ్యూరో: బోయిన్‌పల్లి పరిధిలో హెచ్‌న్యూ, స్థానిక పోలీసులు భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. రూ. 8.5 కోట్ల విలువైన ఎఫిటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. బౌరంపేట్‌కు చెందిన గోసుకొండ అంజిరెడ్డి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో చంద్రారెడ్డి పేరుతో ఫంక్షన్ హాల్, స్విమ్మింగ్ పూల్ నిర్వహించేవాడు. సాయికుమార్, రాకేశ్‌తో పరిచయమైంది. ఈ ఇద్దరితో కలిసి అల్ఫ్రాజోలంను తయారు చేయాలని అంజిరెడ్డి ప్లాన్ చేశాడు. గ్రామంలో కొత్తపల్లి ప్రభాకర్‌గౌడ్ సహకారంతో కోళ్ల ఫారంలో గదిని అద్దెకు తీసుకొని.. రియాక్టర్‌ను ఏర్పాటు చేశాడు. బాలానగర్ నుంచి అంజిరెడ్డి ముడి సరుకులు తెచ్చి సాయి గౌడ్, రాకేశ్‌లకు ఇస్తే.. వారు ఆల్ఫ్రాజోలం, ఎఫిటమైన్ మత్తుపదార్థాలను తయారు చేసి..మార్కెట్‌లో అమ్మడం చేసేవారు.జూన్ 18న కోళ్ల ఫారంపై పోలీసులు దాడి చేసి.. అంజిరెడ్డిని అరెస్ట్ చేసి 2.6 కిలోల ఆల్ఫ్రాజోలంతో పాటు ముడిసరకును స్వాధీనం చేసుకున్నారు. టీజీనాబ్‌కు అంజిరెడ్డి చిక్కడానికి 10 రోజుల ముందే కోళ్లఫారంలో తయారు చేసిన 8.5 కిలోల ఎఫిటమైన్ డ్రగ్‌ను తన అనుచరుడైన గుమ్మిడిదలకు చెందిన కుంచల నాగరాజుకు అందించి.. దానిని భద్రపరుచాలని సూచించాడు.ఈ క్రమంలో నాగరాజు తన వద్ద డ్రగ్‌ను నగరానికి తీసుకెళ్లి అక్కడ అవసరమైన వారికి విక్రయించాలని ప్లాన్ చేశాడు. తన స్నేహితులు వినోద్‌కుమార్‌గౌడ్, శ్రీశైలం సహకారం తీసుకున్నాడు. వాహనంలో బయలుదేరిన ఈ ముగ్గురిని విశ్వసనీయ సమాచారంతో హెచ్‌న్యూ బృందం బోయిన్‌పల్లిలో పట్టుకున్నది. 8.5 కిలోల ఎఫిటమైన్‌ను స్వాధీనం చేసుకొని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. కాగా, సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి ముఠాను అరెస్టు చేసి.. 10 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు.